# ఆదర్శాలు

పురుషోత్తమరావు గొప్ప ఆదర్శ పురుషుడు. అతని ఆదర్శాల వల్లే ఒక విధంగా అటు బంధువులకూ యిటు స్నేహితులకూ  దూరమయ్యేడు.

పురుషోత్తమరావుకు పిత్రార్జితం పుష్కలంగా వుంది. స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా పేరుంది.

అతను ఆఫీసరుగా చార్జి తీసుకున్న రోజే స్టాఫ్ అందర్నీ సమావేశపరిచి "ఆఫీసులో అందరూ డిసిప్లిన్ పాటించాలని వర్క్ టైమ్ ప్రకారం పూర్తవ్వాలని, టైమింగ్స్ రిజిడ్‌గా ఫాలో అవ్వాలని, పార్టీలను ఎవరూ ఎక్కువసేపు ఎంటర్‌టైన్ చెయ్యక వారి పని సత్వరం ముగించి పంపాలని" రూల్స్ పాస్ చేసేడు. అంతేకాదు - ఏ రూపంలోనూ లంచం పుచ్చుకోరాదని. అలా పుచ్చుకున్నవారిపైనా, యిచ్చినవారిపైనా కఠినంగా చర్య తీసుకుంటా" నని చెప్పేడు.

ఒకరోజు ఉదయం పదకొండు గంటల సమయంలో పురుషోత్తమరావు ఆఫీస్‌వర్క్ చూసుకుంటున్న సమయంలో ప్యూన్ వచ్చి-

"సార్! ఎవరో ఆవిడ వచ్చేరు. తవర్ని వెంటనే చూడాలంటున్నారు" అన్నాడు.

వచ్చిన ఆమె వయస్సు సుమారు మూడు పదులలోపే వుంటుంది. చామనచాయ రంగు మనిషి పుష్టిగా వుంది. ముఖంలో మంచి కళ వుంది.

"దండాలండి! యిది తవదే కదండీ!" అంటూ జాకెట్‌లో చెయ్యిపెట్టి చిన్న కార్డ్ తీసి పురుషోత్తమరావు కిచ్చింది.

"ఓ మైగాడ్! ఎక్కడ దొరికిందమ్మాయిది నీకు!" అన్నాడు ఆశ్చర్యంతో.

అది పురుషోత్తమరావు 'బేంక్ క్రెడిట్ కార్డ్'.

"పెట్రోలు బంకు కాడండి! తవ జేబీలోంచి నేలమీద పడిపోనాదండి! తవరు కానుకోనేదు కారెక్కి ఎల్లిపోనారు.."

"థాంక్స్! ఇది ఎంతో విలువైంది! పాపం ఎండలో శ్రమపడి చాలాదూరం నుంచి తెచ్చి యిచ్చేవు!" అని పర్స్‌లోంచి ఇరవై రూపాయల నోటు తీసి ఆమె చేతిలో వుంచి 'టీ త్రాగు' అన్నాడు కృతజ్ఞతతో.

"ఏటి బాబూ! తవరు నాకు నంచం ఎడతన్నారా?" అంది పౌరుషంగా.

ఆమె కామెంట్‌కు పురుషోత్తమరావు షాక్ అయ్యేడు.

"అబ్బే యిది లంచం కాదమ్మా! యిది నేను నీకు..." అంటూ ఏమో చెప్పబోయేడు.

"ఏటేటి? నంచం గాదా! మరి... ఓలమ్మ.. ఓలమ్మ నాను అట్టాంటిదాన్ని అనుకున్నావేటి?" అంటూ విసురుగా బయటకు వచ్చి "సూడండి భావులూ! ఆపీసరాయన సేతిలో నోటెట్టి ఏటేటో అంతన్నాడు!" అంది బిగ్గరగా.

ఆమె కేకలకి ఆఫీసు స్టాఫ్, అదే ఫ్లోర్‌లో వున్న యితర ఆఫీసుల్లోవారూ ఆమె చుట్టూ మూగేరు.

"ఏమయ్యా! ఎన్నో ఆదర్శాలు వల్లిస్తావ్! ఎంతో నీతి మంతుడని విర్రవీగుతావు! యిదేం పనయ్యా నీకు! చెప్పేవి శ్రీరంగనీతులు..." అని నిలదీసారు.

పురుషోత్తమరావుకి నలుగురిలో తలవంపులైంది.

"స్టుపిడ్! నాన్సెన్స్! నిజా నిజాలు తెల్సుకోక ఏమిటి మీరు అంటున్నది! నా బేంక్ క్రెడిట్ కార్డ్ రోడ్డుమీద పడి పోతే యీవిడకు దొరికిందని తెచ్చి యిచ్చింది. ఆమె చేసిన సహాయానికి కృతజ్ఞతతో..."

"నా సేతిల నంచం ఎట్టేనంతావ్!" అంది ఎగతాళిగా.

"ఛా! దాన్ని లంచం అనకూడదమ్మా! బహుమానం, బక్షీస్ అనాలి!" అన్నారు గుంపులో ఒకాయన వ్యంగ్యంగా.

"అవును! కరెక్ట్‌గా చెప్పేరు! యీవిడ ఎండలో ఎంతో శ్రమపడి నన్ను వెతుక్కుంటూ వచ్చి నేను పోగొట్టుకున్న వస్తువు తెచ్చి నాకు యిచ్చినందుకు బహుమానం!"అన్నాడు.

"ఏటేటీ? పెద్దోల సేతిల యిచ్చేది బగుమానం! బచ్చీసా మరి పుచ్చుకున్న కూలోడి సేతిల అది నంచవా! ఆరికో నీతి మాకో నీతా! ఇనండి భావులూ నాయం!' ' అంది ఆవేశంగా.

"అలా అని ఎవరనగలరు? నేను సంతోషంతో యిచ్చింది లంచం ఎట్లాగవుతుంది బహుమానం గాక!"

అట్టాగేం? మరి నా పెనిమిటి ఆదిమూర్తి ఏ నేరం సేసేడని ఉజ్జోగలం నెల దినాలు సస్పెండు సేసేసినావు? ఆ పెద్దాయన ఎవుడో సంతోషంతో "ఛాయి దాగమని' ' పది రూపాయల నోటు సేతిలో ఎట్టి ఎల్లిపోనాడు. అత్తెరి ఆడి కాడు నువ్వు నంచం పుచ్చుకున్నావు! యీ పొద్దు శా కంటపడింది! నాను సూడకుండా ఎందరికాడ నంచాలు పుచ్చుకుంతున్నావో! అని నెలదినాలు సస్పెండు సేసినారు గందా! మరది నంచవైతే యిదేటీ?" అంది ఉక్రోషంగా.

నిజమే! వారం రోజుల క్రితం ఆదిమూర్తికి ఒక కస్టమర్ పదిరూపాయల నోటు యివ్వటం పురుషోత్తమరావు కంట పడింది. ఆదిమూర్తి లంచం తీసుకున్నాడన్న నేరంపై అతడిని నెలరోజులు సస్పెండ్ చేసేడు. అతడి తప్పులేదని ఎందరు ఎన్ని విధాలుగా చెప్పినా పురుషోత్తమరావు వినలేదు.

"అంటే నువ్వు ఆదిమూర్తి భార్యవా!" అన్నాడు పురుషోత్తమరావు తడారిన గొంతుకతో.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక , ఫిబ్రవరి 2000) ✪